నమస్తే తెలంగాణ
ములుగు
జయశంకర్ భూపాలపల్లి
5 | బుధవారం 24 జనవరి 2024 | MULUGU JAYASHANKAR BHUPALPALLY



అతిపెద్ద గిరిజన ఉత్సవంగా ప్రసిద్ధి గాంచిన మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు కేసీఆర్ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇచ్చింది. ఒకప్పుడు రోడ్లు సరిగా లేక సింగిల్ రోడ్లపై జాతరకు వెళ్లడం కష్టంగా ఉండేది. ట్రాఫిక్ జామ్‌తో చిన్న దూరానికి గంటల కొద్దీ సమయం పట్టడం వల్ల రోజంతా ప్రయాణం సాగేది. వన దేవతల గద్దెల పరిసరాల్లోనూ సౌకర్యాలు పెద్దగా ఉండేవి కావు. భక్తులకు తాగునీరు, స్నానాలు, మరుగుదొడ్లకు అవస్థలు ఉండేవి. స్వరాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వ హయాంలో అంతా మారింది. నాలుగు జాతరలకు మొత్తం రూ.332కోట్లు వెచ్చించి శాశ్వత ప్రాతిపదికన నిర్మాణాలు చేపట్టడంతో ప్రయాణం సాఫీగా సాగుతుండగా.. భక్తులకు దర్శనం సులభమైంది. వన్ వే విధానంతో నిత్యం వేలాది మంది రాకపోకలకు వీలు కలిగింది.

– వరంగల్, జనవరి 23 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

# ప్రయాణం సాఫీగా దర్శనం సులువుగా..

## శాశ్వత నిర్మాణాల మేడారం.. కేసీఆర్ సర్కారు కృషి ఫలితం

**నాలుగు జాతరలకు రూ.332 కోట్లు.. స్వరాష్ట్రంలో అధిక నిధులు.. గిరిజన జాతరకు సమగ్ర ఏర్పాట్లు**

**ఒకప్పుడు రోజంతా ప్రయాణం.. అన్ని రోడ్ల అభివృద్ధితో మారిన తీరు**

**2016 నుంచి వన్ వే రూట్.. నిత్యం వేల మందితో జాతర ప్రాంతం**



మేడారం జాతరలో కేసీఆర్ ప్రభుత్వం శాశ్వత ప్రాతిపదిక పనులకు ప్రాధాన్యం ఇచ్చింది. ప్రతి జాతరకు విస్తృతంగా ఏర్పాట్లు చేస్తూ వచ్చారు. అప్పటి అవసరాలను తీర్చడమే కాకుండా శాశ్వత నిర్మాణాలు చేపట్టారు. రాష్ట్రంలో ఎక్కడి నుంచైనా మేడారం జాతరకు వెళ్లేందుకు అనుగుణంగా వన దేవతల గద్దెల చుట్టూ ఐదారు రోడ్డు మార్గాలను అభివృద్ధి చేశారు. జాతీయ రహదారులకు అనుసంధానంగా ఉండేందుకు సింగిల్ లైన్ రోడ్లను డబుల్ లైన్ రోడ్లుగా అభివృద్ధి చేశారు. ఒకప్పుడు రెండేళ్లకోసారి జరిగే జాతర సమయంలోనే భక్తుల రద్దీ ఉండేది. ఇప్పుడు వసతులు పెరగడంతో ప్రతి సెలవు రోజులోనూ వేల మంది భక్తులు వన దేవతలను దర్శించుకుంటున్నారు.

**మేడారం జాతరకు కేసీఆర్ ప్రభుత్వ నిధులు**

| | |
|---|---|
| 2016 | రూ.100 కోట్లు |
| 2018 | రూ.82 కోట్లు |
| 2020 | రూ.75 కోట్లు |
| 2022 | రూ.75 కోట్లు |



### అప్పుడు అలా..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మేడారం జాతర అంటే కొంతమంది కోసమే అన్నట్లుగా పనులు జరిగేవి. ఎన్ని కోట్ల నిధులు ఖర్చు చేసినా తాత్కాలిక అవసరాల పనులు చేసేవారు. జాతర ముగిసిన వెంటనే ఆ పనులు ఎవరికీ కనిపించేవి కావు. సీఎం కేసీఆర్ ప్రభుత్వం వచ్చిన తర్వాత 2016లో మొదటి జాతర జరిగింది. అప్పటి నుంచి శాశ్వత ప్రాతిపదికన పనులు చేపట్టారు. అప్పటినుంచి 2018, 2020, 2022 జాతరలకు కలిపి కేసీఆర్ ప్రభుత్వం రూ.332 కోట్లతో అభివృద్ధి చేసింది. భక్తులు ఉండేందుకు వీలుగా మేడారం జాతర పరిసరాల్లో భారీ షెడ్లను నిర్మించారు. పలు ప్రాంతాలలో భారీ షెడ్లను నిర్మించారు. మేడారంలో ఐదు చోట్ల పెద్ద షెడ్లను, ఒక మినీ షెడ్డును నిర్మించారు. సారలమ్మ ఆలయం ఉండే కన్నెపల్లిలో మరో షెడ్డును నిర్మించారు. మేడారం జాతర నిర్వహణ కోసం దేవాదాయ శాఖ, గిరిజన సంక్షేమ శాఖలు వేర్వేరుగా గెస్టుహౌస్‌లను నిర్మించారు. ట్రైబల్ టూరిజం సర్క్యూట్‌లో భాగంగా మేడారం, తాడ్వాయిలో భక్తుల కోసం హరిత హోటళ్లను నిర్మించారు. ఇవి భక్తులకు, ముఖ్యంగా మహిళా భక్తులకు చక్కగా ఉపయోగడుతున్నాయి. రోడ్లు భవనాల శాఖ, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో వంద కిలోమీటర్ల వరకు రోడ్ల నిర్మాణం, విస్తరణ పనులు చేపట్టారు. మెరుగైన రవాణా సౌకర్యాలతో ఎక్కడా ట్రాఫిక్ జాం కావడం లేదు. రవాణాకు అవసరమైన విధంగా రోడ్ల నిర్మాణం చేయడంతోపాటు ట్రాఫిక్ సమస్యలకు కారణాలను విశ్లేషించారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో జరిగిన మొదటి జాతరకు వరంగల్ నగరం నుంచి వన్ వే ట్రాఫిక్ పద్ధతిని అమలు చేశారు. మేడారం జాతరకు ఏ వైపు నుంచి వచ్చినా ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ఈ విధానం బాగా ఉపయోగపడుతున్నది.

### సౌకర్యాలు ఇలా..

తెలంగాణ రాష్ట్రంలో జరిగిన నాలుగు జాతరలలో 320 కేంద్రాల్లో 6400 మరుగుదొడ్లను నిర్మించారు. జంపన్న వాగు స్నానఘట్టాల వద్ద భక్తులు బట్టలు మార్చుకునేందుకు ప్రత్యేక గదులు నిర్మించారు. పారిశుధ్య నిర్వహణ కోసం నాలుగు వేల మంది పారిశుధ్య కార్మికులను నియమించి మేడారం పరిసరాలను నిత్యం శుభ్రంగా పెట్టారు. 100 ట్రాక్టర్లు, 20 టాటా ఏస్ వాహనాలు, ఎనిమిది జేసీబీలతో నిత్యం చెత్తను తొలగించారు. భక్తులకు వైద్య సేవలు అందించేందుకు ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో, టీటీడీ కల్యాణ మండపం వద్ద పూర్తి స్థాయి దవాఖానలను ప్రారంభించారు. మేడారం పరిసర ప్రాంతాల్లో 19 మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేశారు. భక్తులు మేడారం చేరుకునే ఎనిమిది మార్గాలలో 42 ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేశారు. అత్యవసర వైద్య సేవల కోసం 15 అంబులెన్సులు, 8 బైక్ అంబులెన్సులను అందుబాటులోకి తెచ్చారు. మేడారం జాతరకు వచ్చే భక్తుల కోసం టీఎస్ఆర్టీసీ 51 రూట్ల నుంచి 3845 బస్సులను నడిపింది. మేడారంలో 50 ఎకరాల్లో బస్టాండ్ నిర్మాణం చేపట్టింది. జాతరలో ప్రధాన సమస్య అయిన ట్రాఫిక్ సమస్యలు నివారించేందుకు పోలీసు శాఖ 10,300 మంది సిబ్బందితో విధులు నిర్వర్తించింది. సౌకర్యాలు, వసతుల పరంగా మేడారం జాతరకు కేసీఆర్ ప్రభుత్వం అన్ని విధాలుగా పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేసింది.



జంపన్నవాగు నుంచి కొత్తూరుకు వెళ్లే మార్గంలో పూర్తి కాని కాజ్‌వే నిర్మాణ పనులు

# మహాజాతర నాటికి పనులయ్యేనా?

## నత్తనడకన మేడారం పనులు

**కనిపించని నాణ్యతా ప్రమాణాలు, జవాబుదారీతనం**

**ఆరు ప్రధాన శాఖల ద్వారా 209 పనులు**

**టెండర్ల ద్వారా 81 వీడీసీల ద్వారా 128 పనులు**

**పురోగతిలో రూ.51కోట్ల 56లక్షల 70వేల పనులు**

మేడారం మహాజాతర సమీపిస్తున్నది. మరో నెల రోజుల్లో సమ్మక్క–సారలమ్మ జాతర ప్రారంభం కానున్నది. నెల రోజులు ముందుగానే పూర్తి కావాల్సిన అభివృద్ధి పనులు ఇంకా నత్తనడకన సాగుతున్నాయి. ఆరు ప్రధాన శాఖల ద్వారా రూ.51.56కోట్లతో చేపట్టిన 209 అభివృద్ధి పనుల్లో ఇప్పటివరకు 20శాతం కూడా పూర్తి కాలేదు. ఈ నెల 17న మంత్రులు సీతక్క, కొండా సురేఖ ఉన్నత స్థాయి సమీక్షించి 31వరకు గడువు విధించినప్పటికీ పూర్తయ్యే పరిస్థితి కనిపించడం లేదు. పర్యవేక్షిస్తున్న అధికారులతో పాటు కాంట్రాక్టర్ల వద్ద జవాబుదారీతనం కొరవడినట్లు కనిపిస్తున్నది. మరి జాతరలోగా ఈ పనులన్నీ చేయడం సాధ్యమేనా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పరిస్థితులు చూస్తుంటే హడావుడి చేసి.. మమ అనిపిస్తారా అనే సందేహం కలుగుతోంది.

– ములుగు, జనవరి 23(నమస్తేతెలంగాణ)



తుప్పుపట్టిన బోర్డుకు కలర్ వేసి నూతన బోర్డుగా మార్చుతున్న దృశ్యం

మేడారంలో భక్తుల సౌకర్యార్థం చేపట్టిన అభివృద్ధి పనులు మహాజాతర నాటికి అందుబాటులోకి వచ్చేలా కనిపించడం లేదు. నెల రోజుల క్రితం నుంచే ముందస్తు మొక్కుల చెల్లింపులో భాగంగా మేడారానికి భక్తుల తాకిడి పెరిగింది. ఈ క్రమంలో అభివృద్ధి పనులు పూర్తి కాక వారు ఇబ్బందులు పడుతున్నారు. అమ్మవార్ల జాతరకు నెల రోజుల ముందుగానే పనులు పూర్తి కావాల్సి ఉండగా, ఇప్పటికీ నత్తనడకన సాగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి పనుల కోసం రూ.75 కోట్ల నిధులను విడుదల చేయగా, ఆరు ప్రధాన శాఖల ద్వారా రూ.51కోట్ల 56లక్షల 70వేలను వివిధ ప్రదేశాల్లో 209 అభివృద్ధి పనులను అధికారులు చేపట్టారు. ఇందులో 81 టెండర్, 128 పనులను నామినేటెడ్ పద్ధతిన నిర్వహిస్తున్నారు. చేపట్టిన వాటిలో ఇప్పటివరకు 20శాతం కూడా పూర్తి కాకపోవడంతో ఈ నెల 17న రాష్ట్ర మంత్రులు సీతక్క, సురేఖ ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. అధికారులు ఈ నెల 31వ తేదీ వరకు పనులను పూర్తి చేయిస్తామని హామీ ఇచ్చారు. అయినప్పటికీ పనులు జాతరకు వారం రోజుల ముందుగా కూడా పూర్తయ్యే అవకాశాలు కనిపించడం లేదు.

### కొనసాగుతున్న పనులు

ఆరు శాఖల ద్వారా చేపట్టిన పనులు కొనసాగుతున్నాయి. సివిల్ పనులు పోను మిగిలిన రూ.23.43కోట్లను ములుగు జిల్లాలోని ఇతర అభివృద్ధి పనులకు వినియోగించడంతో పాటు పోలీస్, ఇతర శాఖలకు కేటాయించారు. రోడ్డు, భవనాల శాఖ ద్వారా రూ.4.16 కోట్లతో 14 రోడ్ల మరమ్మతు పనులను చేస్తున్నారు. ఇందులో ఇప్పటివరకు ఏ ఒక్క పని కూడా పూర్తి కాలేదు. ఇరిగేషన్ శాఖ ద్వారా జంపన్నవాగులో తొమ్మిది పనులకు టెండర్లు నిర్వహించి రూ.61.10లక్షలతో చేస్తుండగా, ఏ ఒక్క ప్రాంతంలోనూ పూర్తి కాలేదు. గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ శాఖ ద్వారా మొత్తం 53 పనులను రూ.5.81కోట్లతో చేస్తుండగా ఇందులో 17 టెండర్లు, 36 పనులను నామినేటెడ్ పద్ధతిన కేటాయించారు. ఇవి నత్తనడకన సాగుతున్నాయి. ఆర్‌డబ్ల్యూఎస్ ద్వారా రూ.13.45కోట్లతో 73 ప్రాంతాల్లో పనులు చేస్తుండగా, ఇందులో 31 టెండర్, 42 నామినేటెడ్ పద్ధతిన జరిపిస్తున్నారు. పీఆర్ శాఖ ద్వారా రూ.10.67కోట్లతో పనులు చేపట్టగా, ఇందులో 10 టెండర్, 44 నామినేటెడ్ పద్ధతిన చేపట్టారు. ఈ రెండు శాఖల్లో 10శాతం కూడా పూర్తి కాలేదు. అలాగే విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో రూ.11.36కోట్లతో చేపట్టగా టెండర్ ద్వారా పొందిన ఒకే ఒక్క కాంట్రాక్టర్ నెమ్మదిగా పనులు చేస్తున్నారు. విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన పనులు ముందస్తుగానే చేపట్టడంతో కొన్ని ప్రాంతాల్లో పూర్తయ్యాయి. మిగిలిన ప్రాంతాల్లో వచ్చే నెల 8వరకు పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొందించారు.

### కానరాని నాణ్యతా ప్రమాణాలు

మహాజాతర అభివృద్ధి పనుల్లో కాంట్రాక్టర్లు సిండికేట్‌గా మారి బయటి వ్యక్తులకు దక్కకుండా లోపాయికారి ఒప్పందం చేసుకొంటారని స్థానికంగా విమర్శలు వినిపిస్తున్నాయి. గత నాలుగైదు జాతరల్లో పనులు చేసిన కాంట్రాక్టరే ఈసారి కూడా ఎక్కువ మొత్తంలో పనులు పొందారు. అధికారులు, ప్రజాప్రతినిధులను మచ్చిక చేసుకొని నాణ్యతా ప్రమాణాలకు తిలోదకాలిచ్చి పనులను చేపడుతున్నారు. ఇదే విషయమై సమీక్షలో మంత్రులు అధికారులను నిలదీయగా కాంట్రాక్టర్లు లెస్‌కు టెండర్లు వేసి పనులు దక్కించుకున్నారని తెలిపారు. దీంతో మంత్రులు సదరు కాంట్రాక్టర్లపై ప్రత్యేక దృష్టిసారించి క్వాలిటీ కంట్రోల్‌తో తనిఖీ చేయించిన తర్వాతే బిల్లులు చెల్లించాలని ఆదేశించారు. నాణ్యత పాటించని కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్ట్‌లో పెట్టి మరోసారి టెండర్లలో పాల్గొనకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా కాంట్రాక్టర్లకు వంత పాడుతూ ప్రభుత్వ సొమ్మును దుర్వినియోగం చేసేలా విధులు నిర్వర్తించే అధికారులపై కూడా కఠిన చర్యలు చేపడుతామని హెచ్చరించారు.



అధికారుల పర్యవేక్షణ లేకుండా జంపన్నవాగు వద్ద స్నాన ఘట్టాల రిపేరింగ్ పనులు



బీఆర్ఎస్ పార్టీకి చెందిన స్థలంలో అక్రమ నిర్మాణాన్ని చూపుతున్న స్థానిక నాయకులు

# బీఆర్ఎస్ పార్టీ ఆఫీస్ స్థలం ఆక్రమణ

కరీమాబాద్, జనవరి 23: ఖిలావరంగల్ మండల పరిధి రంగశాయిపేటలోని పుల్లాయకుంట 140, 142 సర్వే నంబర్లలో బీఆర్ఎస్ పార్టీకి అధికారులు కేటాయించిన స్థలం ఆక్రమణకు గురైంది. ఈమేరకు సామాజిక కార్యకర్త ఫణీ, చెరువుల రక్షణ కమిటీ నాయకుడు పెరుమాండ్ల లక్ష్మణ్ ఆరోపించారు. మంగళవారం స్థలాన్ని పరిశీలించిన అనంతరం వారు మాట్లాడుతూ ఆ స్థలాన్ని గత ఏడాది బీఆర్ఎస్ పార్టీకి కేటాయించగా, అందులో బీఆర్ఎస్ పార్టీ వరంగల్ జిల్లా కార్యాలయం నిర్మించేందుకు మే 2023లో భూమిపూజ సైతం చేశారని తెలిపారు. ఆ స్థలంలో కొందరు అక్రమ నిర్మాణాలు చేపట్టారని వారు ఆరోపించారు. అధికారులు విచారణ చేపట్టి స్థలాన్ని కబ్జాదారుల నుంచి కాపాడాలని కోరారు. స్థలం ఆక్రమించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలన్నారు.

# ఎందుకింత కాలయాపన?

**నెలాఖరుకు పనులు పూర్తవుతాయా?**

**ట్రైబల్ వెల్ఫేర్ సెక్రటరీ శరత్ అసంతృప్తి**

**మేడారం పనులపై సమీక్ష**

తాడ్వాయి, జనవరి 23 : మేడారంలో అభివృద్ధి పనులను ఎందుకింత కాలయాపన చేస్తున్నారని గిరిజన సంక్షేమ శాఖ సెక్రటరీ శరత్ అధికారులపై మండిపడ్డారు. పనుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేసిన ఆయన నెలాఖరు వరకు పూర్తి చేస్తారా అని అధికారులను ప్రశ్నించారు. మంగళవారం ఆ శాఖ డైరెక్టర్ వెంకట నర్సింహారెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి జాతర పరిసరాల్లో ఆయన పర్యటించారు. మొదట కలెక్టర్ త్రిపాఠి, పీవో అంకిత్, ఎస్పీ శబరీష్‌తో కలిసి అమ్మవార్లను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం సమ్మక్క భవన్‌లో వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన పనులతో పాటు, పురోగతిని శాఖల వారీగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం శరత్ మాట్లాడుతూ పనులు నెల రోజుల ముందు ప్రారంభించినా నేటికీ కొన్ని 60శాతం, మరికొన్ని 30శాతం వరకు మాత్రమే చేశారు, మిగిలిన పనులు వారం రోజుల్లో ఎలా పూర్తి చేస్తారని ప్రశ్నించగా పలు శాఖల అధికారులు సమాధానం చెప్పలేక నీళ్లు నమిలారు. పనుల్లో వేగం పెంచి పూర్తి చేయాల్సింది పోయి కాలయాపన ఎందుకు చేస్తున్నారని మండిపడ్డారు. హడావుడిగా పనులు చేస్తే కుదరదని, ప్రతి పనిలో నాణ్యతా ప్రమాణాలు పాటించాల్సిందేనని హెచ్చరించారు. ముందస్తు మొక్కుల కోసం భక్తులు భారీగా వస్తున్నారని, ప్రభుత్వం కల్పించిన సౌకర్యాలు వారికి ఉపయోగపడేలా ఉండాలన్నారు. నిరంతరం పారిశుధ్య పనులు చేపట్టడంతో పాటు తాగునీటిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పార్కింగ్ స్థలాల్లో ఇబ్బందులు తలెత్తకుండా సైన్ బోర్డులు, మరుగుదొడ్లు, ఫ్లడ్‌లైట్లు తదితర చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి పనిలో నాణ్యాతా ప్రమాణాలు పాటించాలని, స్టాళ్ల వద్ద డస్ట్‌బిన్లు ఏర్పాటు చేయాలని సూచించారు. పనుల్లో వేగం పెంచి జాతరను విజయవంతం చేయాలని సూచించారు. వీఐపీ, వీవీఐపీ పార్కింగ్‌కు రోడ్డు చదును చేసి ఒక్కో పార్కింగ్‌లో ఎన్ని వాహనాలు పార్క్ చేయవచ్చో వివరాలు ప్రదర్శించాలన్నారు. జంపన్నవాగులో లోతు ప్రదేశాలను గుర్తించి ఇసుక లెవలింగ్ పనులు పూర్తి చేయాలన్నారు. అంతరాయం లేని విద్యుత్ సరఫరా, అత్యవసర వైద్యం కోసం మినీ అంబులెన్సులను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. డైరెక్టర్ వెంకటనర్సింహారెడ్డి మాట్లాడుతూ కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలన్నారు. బారికేడ్ల ఏర్పాటులో పోలీస్ శాఖ సమన్వయంతో పని చేయడంతో పాటు, భక్తులకు సౌకర్యాలు తెలిసేలా సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు శ్రీజ, వేణుగోపాల్, డీఎఫ్‌వో రాహుల్ కిషన్ జాదవ్, ఓఎస్డీ అశోక్‌కుమార్, వివిద శాఖల ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న సెక్రటరీ శరత్

# ఆస్తి కోసం బంధాన్ని మరిచి..

**చెల్లెలిపై గొడ్డలితో దాడిచేసిన అన్న**

**వెంకటాపూర్ మండలం లక్ష్మీదేవిపేటలో ఘటన**

వెంకటాపూర్, జనవరి 23 : ఆస్తి కోసం తోడబుట్టిన చెల్లి అనే కనికరం లేకుండా ఓ వ్యక్తి గొడ్డలితో దాడి చేశాడు. ఈ ఘటన మంగళవారం ఉదయం మండలంలోని లక్ష్మీదేవిపేటలో జరిగింది. గ్రామానికి చెందిన పొన్నం శ్రీహరికి ముగ్గురు ఆడపిల్లలతో పాటు సమ్మయ్య సంతానం. వీరిలో ఒక అమ్మాయికి వివాహం చేశాక శ్రీహరి మరణించడంతో తల్లి రాధమ్మతో దివ్యాంగులైన సమ్మక్క, సారక్క ఉంటున్నారు. ఈ క్రమంలో అనారోగ్యం రీత్యా తండ్రి ఇచ్చిన భూమిని ఇటీవల సమ్మక్క, సారక్క విక్రయించారు. తనకు తెలియకుండా భూమి ఎలా విక్రయిస్తారని అన్న సమ్మయ్య పలుమార్లు పంచాయితీ చేయడంతో పాటు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాడు. ఈ విషయంలో మంగళవారం సారక్కతో గొడవ పడి గొడ్డలితో గాయపరిచాడు. దీంతో ఆమె అపస్మారక స్థితిలోకి వెళ్లింది. విషయం తెలుసుకున్న ఎస్సై చల్లా రాజు ఘటనా స్థలానికి చేరుకొని సమ్మయ్యను అదుపులోకి తీసుకుని సారక్కను వైద్యం కోసం ఆస్పత్రికి తరలించారు.



నిందితుడు సమ్మయ్య

# మిర్చితో మార్కెట్ కళ కళ



మార్కెట్‌కు వచ్చిన మిర్చి బస్తాలు

**20వేల బస్తాలకు పైగా రాక.. నిలకడగానే మిర్చి ధరలు**

**వ్యాపారులు, కార్మికుల హర్షం**

కాశీబుగ్గ, జనవరి 23: వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ మిర్చి రాకతో కళకళలాడుతోంది. డిసెంబర్ నుంచి కొత్త మిర్చి మార్కెట్‌కు వస్తోంది. సీజన్ ప్రారంభంలో 2వేల నుంచి 10వేల బస్తాల వరకు రాగా సంక్రాంతి తర్వాత పెద్ద సంఖ్యలో వస్తున్నాయి. ఈ నెల 19న అత్యధికంగా 25వేల బస్తాలు వచ్చాయి. సోమ, మంగళవారాల్లో 20వేలకు పైగా వచ్చినట్లు అధికారులు తెలిపారు. ధరలు హెచ్చు తగ్గులు లేకుండా నిలకడగానే ఉంటున్నట్లు చెప్పారు. మిర్చి రాక పెరగడంతో అడ్తి, ఖరీదు వ్యాపారులతో పాటు దడువాయి, గుమస్తా, హమాలీ, ఇతర కార్మికవర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటివరకు మార్కెట్‌కు 98వేల క్వింటాళ్లు వచ్చినట్లు మార్కెట్ వర్గాలు తెలిపాయి. మంగళవారం సుమారు 20వేల బస్తాలు వచ్చాయి. తేజ రకం 12,500, వండర్‌హాట్ 500, యూఎస్ 3,413, తాలు రకం మిర్చి 2వేల బస్తాలు వచ్చాయి. అత్యధికంగా తేజ రకం క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.20,400, కనిష్ఠం రూ.14,500, వండర్‌హాట్ అత్యధికంగా రూ.18వేలు, కనిష్ఠంగా రూ.15వేలు, యూఎస్ 341 రూ.16, 500, కనిష్ఠంగా 13వేలు, తాలు మిర్చి రూ.8,800, కనిష్ఠంగా రూ.5500 పలికింది

# కేయూలో క్రాస్‌కంట్రీ పోటీలు

- **పురుషుల్లో కేడీసీ, మహిళల్లో వ్యాయామ కాలేజీ విజేతలు**
- **బహుమతులు ప్రదానం చేసిన వీసీ రమేశ్**

హనుమకొండ చౌరస్తా, జనవరి 23: కేయూ స్పోర్ట్స్ బోర్డు ఆధ్వర్యంలో 'ఇంటర్ కాలేజీయేట్ క్రాస్ కంట్రీ చాంపియన్ షిప్(పురుషులు, మహిళల) పోటీలను వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్ ప్రారంభించారు. పురుషుల క్రాస్‌కంట్రీ విన్నర్ చాంపియన్‌షిప్‌ను హనుమకొండ కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ కైవసం చేసుకోగా, రన్నర్‌గా ఖమ్మం విశ్వవిద్యాలయ వ్యాయామ కాలేజీ నిలిచింది. మహిళల విభాగంలో విన్నర్‌గా విశ్వవిద్యాలయ వ్యాయామ కళాశాల నిలువగా, రన్నర్‌గా టీటీడబ్ల్యూఆర్డీసీ(మహిళా), ఉట్నూర్ కాలేజీ నిలిచిందని విశ్వవిద్యాలయ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి ఆచార్య శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో భాస్కర్, ఏటీబీటీ ప్రసాద్, సావిత్రి, జేత్య, ఉపేందర్, రమేష్, రామాంజనేయులు పాల్గొన్నారు.

### విశ్రాంత ఉద్యోగుల క్రీడలు..

గణతంత్ర దినోత్సవం సందర్భంగా విశ్వవిద్యాలయ విశ్రాంత బోధన, బోధనేతర ఉద్యోగుల క్రీడలను వీసీ రమేశ్ ప్రారంభించారు. వాలీబాల్, బాల్‌బ్యాడ్మింటన్, టెన్నిస్ ప్రీ ఫైనల్ జరిగినట్లు ఆచార్య ఎర్రగట్టు స్వామి, సంగాల గిదియన్ తెలిపారు.




కేయూలో జరిగిన క్రాస్‌కంట్రీ పోటీల్లో గెలుపొందిన విశ్వవిద్యాలయ వ్యాయామ కాలేజీ విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న వీసీ రమేశ్